ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 19 జూన్ 2024

చాగలమర్రిలో కుండపోత వర్షం

చాగలమర్రి: చాగలమర్రి మండలంలో 43.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీ వర్షానికి వక్కిలేరు పొంగి ప్రవహించింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయ ప్రాంగణాలు, లోతట్టు ప్రాంతాల రహదారులు జలమయమయ్యాయి. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల సమీపంలోని వక్కిలేరు వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి.

జిల్లాలో జోరువాన

- ఆత్మకూరు, రుద్రవరం, చాగలమర్రిలో భారీ వర్షం
- ఇతర మండలాల్లోనూ ఓ మోస్తరుగా...
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

చాగలమర్రి మండలం కలుగొట్లపల్లె వక్కిలేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద



నంద్యాల టౌన్, జూన్ 18: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం కారణంగా నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కొన్ని చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇందులో ఉయ్యాలవాడలో అత్యధికంగా 109.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ఆళ్లగడ్డలో 102.2, రుద్రవరంలో 100.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మహానందిలో 47.4, దొర్నిపాడులో 44.2, చాగలమర్రిలో 43.4, సంజామలలో 21.0, కోవెలకుంట్లలో 18.4, బండిఆత్మకూరులో 13.6, శిరివెళ్లలో 11.2, బనగానపల్లెలో 10.2, గోస్పాడులో 4.2, నంద్యాలలో 1.4, కొలిమిగుండ్లలో 1.4, వెలుగోడులో 0.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సరాసరి 18.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.



ఆత్మకూరు మండలం అమలాపురం సమీపంలోని భవనాశిలో ప్రవహిస్తున్న వర్షపునీరు

ఆత్మకూరులో జోరువాన

ఆత్మకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం కారణంగా ఆత్మకూరు పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. మధ్యాహ్నం వరకు కొంతమేర ఎండతీవ్రత, ఉక్కబోత ఉన్నప్పటికీ ఆతర్వాత మధ్యాహ్నం 3 గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం మొదలైంది. సుమారు గంటకుపైగా వర్షం ఏకధాటిగా కురవడంతో లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచింది. అలాగే తిక్కయ్యస్వామిదర్గా, కప్పలకుంట, అప్పారావువీధి, తోటగేరి, పోస్టాఫీసు ఏరియా తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు అసౌకర్యానికి లోనయ్యారు. అదేవిధంగా పట్టణ శివార్లలోని పడేవాగు, భవనాశిలో కూడా నీటిప్రవాహం ఉధృతంగా కొనసాగింది.

జలమయం అయిన ఉయ్యాలవాడ-మాయలూరు ప్రధాన రహదారి





రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నె గ్రామం వద్ద తుమ్మచెట్టుపై పిడుగు పడిన దృశ్యం

పిడుగుపాటుకు ఐదు మూగజీవాలు మృతి

రుద్రవరం: రుద్రవరం మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 100.44 మీ.మీ., వర్షపాతం నమోదైంది. ఎర్రగుడిదిన్నె గ్రామంలో పిడుగుపాటుకు ఐదు మూగజీవాలు మృతి చెందాయి. తుమ్మచెట్టు పిడుగుపాటుకు గురై చీలిపోయింది. ఎర్రగుడిదిన్నె గ్రామానికి చెందిన వజ్జల గురమ్మ , వెంకటేశ్వర్లుకు చెందిన మూడు మేకలు, ఒక మేకపోతు, ఒక గొర్రె పిడుగుపాటుకు మృతి చెందాయి. మొత్తం రూ.60వేలు నష్టం వాటిల్లింది. భారీ వర్షానికి రుద్రవరం పెద్దరాజుచెరువుకు వరద పోటెత్తింది. గంగ 20వ బ్లాక్‌ఛానెల్, నల్లవాగు, చిన్నేరువాగు, వక్కిలేరువాగు, కొండవాగులు జలకళ సంతరించుకుంది.

పిడుగుపడి మృతి చెందిన జీవాలు



వక్కిలేరు వాగుపై
మృతుడి కుటుంబీకుల అవస్థలు

చాగలమర్రి: మండలంలో ఎడతెరిపి లేకుండా మంగళవారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షంతో వక్కిలేరు పొంగి ప్రవహించింది. బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలోని వక్కిలేరు వంతెనపై వరద నీరు పొంగి ప్రవహించడంతో గ్రామస్థులకు కష్టాలు తప్పలేదు. గ్రామానికి చెందిన అగస్టిన్ (50) కడప నిమ్స్ వైద్యశాలలో వైద్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు వాహనంలో తీసుకొచ్చారు. గ్రామ సమీపంలోకి రాగానే వక్కిలేరుపై వరద భారీగా ప్రవహిస్తోంది. ఇక చేసేది లేక అగస్టిన్ కుటుంబ సభ్యులు అతి కష్టం మీద మృతదేహాన్ని తరలించాల్సి వచ్చింది. మంచం మీద మృతదేహాన్ని తీసుకొచ్చి ఒడ్డుకు చేర్చారు. వక్కిలేరు ఉధృతంగా ప్రవహిస్తే ఇతర ప్రాంతాలతో రాకపోకలు ఆగిపోతాయి. హైలెవెల్ వంతెన లేకపోవడంతో వరద వచ్చిన ప్రతిసారి ఇలాంటి దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందని సమీప గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బ్రాహ్మణపల్లెలో మంచంపై మృతదేహంతో వక్కిలేరు వరద నీటిని దాటుతున్న కుటుంబీకులు, బంధువులు

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారు జాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. మండలంలో 102.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంజేడు గ్రామ సమీపంలో ఉన్న కుందవాగు వంతెనపై నీళ్ల ప్రవహించటంతో ఆళ్లగడ్డ- ఉయ్యాలవాడ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మాయలూరు బస్టాండ్ వద్ద విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. ఉయ్యాలవాడ బస్టాండ్ ఆవరణం అంతా జలమయంగా మారి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఉయ్యావాడలోని ఉన్నత పాఠశాల ఆవరణం చెరువును తలపించింది.

చెరువును తలపిస్తున్న ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల ఆవరణ





పోస్టింగ్ ప్లీజ్..!

- పైరవీలు మొదలెట్టిన ఉద్యోగులు
- వైసీపీతో అంటకాగిన అధికారుల యత్నాలు
- అడ్డదారుల్లో పావులు కదుపుతున్న వైనం
- నంద్యాల జిల్లా కేంద్రంలో పోస్టింగుల కోసం రూ.లక్షలు ఆఫర్?
- ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు
- వైసీపీ హయాంలో చక్రం తిప్పినోళ్లే రాయబేరాలు

'సార్.. నేను మీ మనిషినే. ఒకసారి నాపై దృష్టి పెట్టండి..' అంటూ ఓ అధికారి పైరవీ మాటలు. 'సార్.. వైసీపీ హయాంలో మీకు అనుకూలంగా వ్యవహరించాను. కాస్త నా గురించి ఆలోచించండి.. ప్లీజ్..' అంటూ మరో అధికారి రిక్వెస్ట్. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు పదుల సంఖ్యలో కీలక ఉద్యోగులు ఎవరికి వారు నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు . వీరిలో ఎక్కువమంది వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలకు అనుకూలించిన వారే కావడం గమనార్హం. గత ఐదేళ్లూ వైసీపీతో అంటకాగిన ఉద్యోగులు నేడు టీడీపీ అధికారంలోకి రాగానే ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించారు. టీడీపీ నేతలు, ఎమ్మెల్యేల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఫలానా చోట పోస్టింగ్ ఇప్పించరూ... అంటూ పైరవీలు మొదలు పెట్టేశారు.

నంద్యాల టౌన్, జూన్ 18: రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే కొందరు కీలక స్థానాల్లో ఉన్న ఉద్యోగుల తీరు కూడా మారిపోయింది. కొత్త కొలువుల కోసం గెలిచిన నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులతో, ప్రజాప్రతినిధులతో అంటకాగుతూ వారికి ఆర్థిక, రాజకీయ మేలు చేకూర్చడమే లక్ష్యంగా పని చేసిన వారే పైరవీల్లో ముందు ఉండటం గమనార్హం. వివిధ ప్రభుత్వ శాఖల్లో అత్యంత కీలకంగా వ్యవహరించిన, ఒక దశలో వైసీపీకి ముఖ్య అనుచరగణ స్థాయిలో చక్రం తిప్పిన వారంతా టీడీపీ ప్రభుత్వంలో కూడా కీలకమైన విభాగాల్లో పోస్టింగులు తెప్పించుకునేందుకు తెరచాటుయత్నాలు సాగిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. త్వరలోనే అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో మొదటి అసెంబ్లీ సమావేశాలు పూర్తికాగానే రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కూడా బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో అడ్డదారుల్లో పైరవీలే లక్ష్యంగా వైసీపీతో అంటకాగిన అధికారులు కీలక స్థాయిల్లో పోస్టింగుల కోసం పావులు కదుపుతున్నారు.

బనగానపల్లె టూ నంద్యాల

బనగానపల్లెలో డివిజన్ స్థాయిలో ఓ ప్రభుత్వ శాఖలో ఇంజనీరుగా విధులు నిర్వహించిన అధికారి అక్కడి వైసీపీ నాయకులకు ఊడిగం చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ అధికారంలోకి రావడం, అక్కడ మంత్రి పదవి కూడా దక్కడంతో తనకు ఎక్కడ ఇబ్బంది కలుగుతుందోనన్న ఉద్దేశంతో డీఈ పోస్టింగ్ కోసం రాజకీయ వెంపర్లాటకు తెరలేపడం ఆ శాఖలో ప్రకంపణలు రేపుతోంది. వైసీపీతో అంటకాగిన సదరు డీఈ స్థాయి అధికారి జిల్లా కేంద్రంలో పోస్టింగ్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. టీడీపీలో ఉన్న కొందరు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకుల చుట్టూ తిరుగుతూ తనను నంద్యాలకు బదిలీ చేయించాలని విన్నవించుకుంటున్నట్లు సమాచారం. బదిలీ చేయిస్తే తన చేతిలో రూ.కోట్లు విలువ చేసే కాంట్రాక్టు పనులు ఉంటాయని, అన్ని విధాలుగా మీకు సహకరిస్తానని బహిరంగంగానే ఆఫర్ ఇచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.20 కోట్ల బిల్లుల కోసం..

వైసీపీ ప్రభుత్వంలో నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓ వైసీపీ కీలక నేత కాంట్రాక్టర్‌గా రూ.కోట్లు విలువ చేసే పనులు చేశాడు. వైసీపీ ప్రభుత్వంలోనే బిల్లులు మంజూరు కాలేదు. వైసీపీ నేత చేసిన కాంట్రాక్టు పనుల్లో కొన్ని పనులకు పనులు చేయకుండానే ఎం.బుక్ రికార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్మును కాజేసేందుకు ఆ శాఖలోని కీలక అధికారితో కుమ్మక్కయ్యాడు. జిల్లా కేంద్రంలో అత్యంత కీలకమైన ఈ శాఖకు ముఖ్య అధికారిగా అర్హత లేకున్నా.. పక్క జిల్లాలో పని చేస్తున్న కిందిస్థాయి ఉద్యోగికి పట్టంకట్టి, ఉన్నత స్థాయి పోస్టులో కూర్చోబెట్టి రూ.కోట్లు విలువ చేసే కాంట్రాక్టు పనులకు బిల్లులు చేసే స్థాయిలో వైసీపీ నాయకులకు ముఖ్య అనుచరుడుగా కొనసాగారు. టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నేతకు రావాల్సిన రూ.20 కోట్ల బిల్లులు క్లియర్ చేసేందుకు జిల్లాలోని పలువురు కీలక టీడీపీ ప్రజాప్రతినిధుల వద్దకు తనను ట్రాన్స్‌ఫర్ చేయించకుండా ఆపుకునేందుకు లాబియింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

పోలీస్ శాఖలోనే అధికం..

గత ఐదేళ్లలో టీడీపీని, ఆ పార్టీ నాయకులను వ్యక్తిగతంగా, రాజకీయంగా, ఆర్థికంగా దెబ్బతీయడంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న కొందరు ఉద్యోగులు అత్యుత్సాహం చూపారు. టీడీపీ శ్రేణులే లక్ష్యంగా పెట్టుకుని వైసీపీ ప్రభుత్వంలో పెత్తనం చెలాయించిన పోలీస్‌శాఖలోని కొందరు అధికారులు ఇప్పుడు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. సర్కిల్ స్థాయి అధికారులు జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లలో పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారు. తమకున్న పరిచయాలు, బంధుత్వాలను అడ్డుపెట్టుకొని తెలుగుదేశంలోని కొందరు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులకు రూ.లక్షలు ఆఫర్ చేయడం ద్వారా పోస్టింగుల కోసం వెంపర్లాటకు తెరలేపినట్లు సమాచారం.

- జిల్లాలో శాంతిభద్రతలను పర్యవేక్షించే అత్యంత కీలకమైన పోలీస్ శాఖలో గత కొన్నేళ్ళుగా ఇక్కడ సర్కిల్ స్థాయిలో ఓ అధికారి చక్రం తిప్పారు. అన్నీ తానై వ్యవహరించిన ఆ అధికారి తీరుతో క్రిందిస్థాయి సిబ్బంది సైతం తీవ్ర అవస్థలు పడ్డారు. అంతర్గత బదిలీలలో సైతం జోక్యం చేసుకుని జిల్లా పోలీస్ శాఖను వైసీపీ ప్రభుత్వ అండతో శాసించిన ఆ అధికారిని ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు పలు ఆరోపణలతో బదిలీ వేటు వేశారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధుల చుట్టూ ఉన్న కొంత మంది కోటరీ సభ్యులకు గాలం వేస్తున్నారు. 'ఎంత కావాలో తీసుకోండి సర్.. పోస్టింగ్ మాత్రం నంద్యాలలోనే ఇప్పించండి..' అంటూ రాయబేరాలు పంపుతున్నారు. ప్రస్తుతం పక్క జిల్లాలో పని చేస్తున్న ఓ సర్కిల్ స్థాయి అధికారి జిల్లా కేంద్రంలో ఏ స్టేషన్ అయినా ఒకే.. ఎలాగైనా పోస్టింగ్ ఇప్పించాలని ఓ ప్రముఖ నాయకుడిని ఆశ్రయించాడు.



రైతుల ఖాతాకు పీఎం కిసాన్ సాయం



కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 18 : రైతులకు పెట్టుబడి ఖర్చు కింద కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రైతుల బ్యాంకు ఖాతాలకు ఒక్కొక్కరికి రూ.2వేల ప్రకారం జమ చేశారు. కర్నూలు జిల్లాలో 2.34 లక్షల మంది రైతులకు రూ.46.97 కోట్లు, అదే విధంగా నంద్యాల జిల్లాలో 1.95 లక్షల మంది రైతులకు రూ.39.19 కోట్లు అందించారు. ఉమ్మడి జిల్లాకు 4,29,029 మంది రైతులకు రూ.86.97 కోట్లును అందించారని వ్యవసాయ శాఖ కర్నూలు జేడీ వరలక్ష్మి తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల
జిల్లాలో 55 శాతం ఉత్తీర్ణత



నంద్యాల (నూనెపల్లె), జూన్ 18: ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. నంద్యాల జిల్లా 55 శాతంతో ఉత్తీర్ణత సాధించింది. మే నెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. జిల్లాలో 31 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లా వ్యాప్తంగా ద్వితీయ సంవత్సర విద్యార్థులు 4,187 మందికి గాను 2,313 మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీవీఈవో సునీత తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 62 శాతం ఉత్తీర్ణత సాధించారని, 376 మంది విద్యార్థులకు గాను 233 మంది ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. జిల్లాలో 8 ప్రభుత్వ కళాశాలల్లో సప్లిమెంటరీ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు.

నామ మాత్రమేనా..?



కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 18:
గత రబీలో వర్షాభావం వల్ల ఉమ్మడి జిల్లా రైతులు పూర్తిగా నష్టపోయారు. అధికార యంత్రాంగం 1,30,189 హెక్టార్లలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయని, 1,16,912 మంది రైతులు నష్టపోయారని, వారికి రూ.128.87 కోట్ల నష్టపరిహారాన్ని అందించాలని అంచనా వేసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఈ మొత్తంలో దారుణమైన కోత పెట్టి నష్టపరిహారాన్ని రూ.96 కోట్లకు పరిమితం చేసింది. ఈ పరిహారాన్ని అందజేసేందు కోసం కేంద్ర ప్రభుత్వం కరువు బృందాన్ని రాష్ట్రానికి పంపిస్తోంది. 10 మంది వివిధ విభాగాలకు చెందిన అధికారులు మూడు టీములుగా ఏర్పడి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కరువు పరిస్థితులను మంగళవారం నుంచి పరిశీలించనున్నారు. అయితే కేంద్ర బృందం ఎంత వరకు వాస్తవ పరిస్థితులు పరిశీలించేదీ వేచి చూడాలి.

6 మండలాల పరిధిలోనే పరిశీలన

ఉమ్మడి జిల్లాలోని 54 మండలాల్లో కరువు పరిస్థితులు ఉంటే కరువు తీవ్రత కేవలం 31 మండలాల్లోనే కనిపిస్తోందని, జిల్లా అధికార యంత్రాంగం నివేదికను తయారు చేసింది. ఆ మేరకైనా పరిహారం ఇస్తారేమో అని రైతులు ఆశ పెట్టుకున్నారు. కానీ కేంద్ర కరువు బృందం నేటి నుంచి కర్నూలు జిల్లాలో ఆలూరు, కోడుమూరు, కర్నూలు మండలాల్లో, నంద్యాల జిల్లాలో కోవెలకుంట్ల, దొర్నిపాడు, నంద్యాల మండలాల్లో మాత్రమే పర్యటించనున్నారు.

నష్టపోయింది 1.16 లక్షల మంది రైతులు.. పరిహారం కేవలం రూ.96 కోట్లే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత రబీలో దాదాపు 3 లక్షల మంది రైతులు మూడున్నర లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేసి మొత్తం నష్టపోయారు. అయితే.. ఉమ్మడి జిల్లా వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు కేవలం 1,16,912 మంది రైతులు మాత్రమే, 1,30,189 లక్షల హెక్టార్లల్లో పంట నష్టపోయారని, వారికి రూ.128.89 కోట్ల పరిహారాన్ని ఇవ్వాలని నివేదికలు తయారు చేశారు. అయితే ఈ మొత్తాన్ని ప్రభుత్వం రూ.96 కోట్లకే పరిమితం చేసింది. వాస్తవ కరువు పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి 33 శాతం కంటే తక్కువ పంట నష్టం జరిగినా పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.



ఉమ్మడి జిల్లాలో గత రబీలో పంట నష్టపోయిన మండలాలు ఇవే

- కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, ఓర్వకల్లు, కోడుమూరు, కల్లూరు, గూడూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి, హోళగుంద, హాలహర్వి, పత్తికొండ, తుగ్గలి మద్దికెర, వెల్దుర్తి, సి.బెళగల్ మండలాలు.
- నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, దొర్నిపాడు, నంద్యాల, నందికొట్కూరు, అవుకు, కోవెలకుంట్ల, మిడుతూరు, సంజామల, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, గోస్పాడు, బనగానపల్లె, గడివేముల మండలాలు .

నష్టపోయిన రైతులందరికీ పరిహారాన్ని అందించాల్సిందే



కనీసం గత రబీలో అధికారులు గుర్తించిన 31 మండలాల్లోని రైతులకైనా పరిహారం ఇవ్వాలి. లేకపోతే ఆందోళనలు చేపడుతాం.

- జగన్నాథం, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి



పరిహారం అందించేందుకు చర్యలు



గత రబీలో పంటలు నష్టపోయిన రైతుల జాబితాను నిబంధనల మేరకు తయారు చేశాం. కరువు తీవ్రతను కేంద్ర బృందం పరిశీలించాక ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం.

- వరలక్ష్మి, జేడీ. కర్నూలు

- ఉమ్మడి జిల్లాలోని ఆరు గ్రామాల్లోనే కరువు బృందం పర్యటన..
- కొద్ది మంది రైతుల ముఖాముఖితో మమ
- కేంద్ర కరువు బృందాన్ని నిలదీస్తామంటున్న రైతు సంఘాల నేతలు
- నిబంధనలను పక్కన పెట్టి అందరికీ న్యాయం చేయాలని డిమాండ్
- నేటి నుంచి రెండు రోజుల పాటు కేంద్ర కరువు బృందం పరిశీలన

ప్రాణం తీసిన సీటు గొడవ

- కత్తితో దాడి, యువకుడి మృతి
- నంద్యాల జిల్లా ఆత్మకూరులో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

ఆత్మకూరు రూరల్, జూన్ 18: వాహనంలో సీటు కోసం జరిగిన గొడవ ఓ యువకుడి ప్రాణాన్ని బలిగొంది. సీటు దక్కలేదన్న కోపాన్ని మనసులో ఉంచుకున్న యువకుడు రెండు రోజుల తర్వాత మరో యువకుడిని కత్తితో హత్య చేసిన సంఘటన నంద్యాల జిల్లా ఆత్మకూరులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామానికి చెందిన ఫరూక్, కృష్ణాపురం గ్రామానికి చెందిన ముర్తుజావలి హైదరాబాదులో కోవా బన్ను వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. హైదరాబాదులో వ్యాపారాన్ని ముగించుకుని ఇద్దరు ఈ నెల 16వ తేదీన కోవా బన్నును తరలించే టాటా ఏస్ వాహనంలో ఆత్మకూరుకు బయలుదేరారు. అయితే వాహనంలో డ్రైవర్ పక్కసీటులో కూర్చునే విషయంలో ఫరూక్, ముర్తుజావలి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. 17వ తేదీన వారిద్దరూ స్వగ్రామాలకు చేరుకున్నారు. అయితే ఫరూక్ అదే రోజు రాత్రి ముర్తుజావలికి ఫోన్ చేసి సీటు విషయంలో జరిగిన అంశాన్ని ప్రస్తావిస్తూ దుర్భాషలాడాడు. 'దమ్ముంటే కురుకుంద గ్రామానికి రా..' అంటూ సవాల్ విసిరాడు. సవాల్‌ను స్వీకరించిన ముర్తుజావలి స్నేహితులతో కలసి కురుకుంద గ్రామానికి వెళ్లి ఫరూక్‌తో గొడవకు దిగాడు. ముర్తుజావలి వెంట ఆత్మకూరు పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌వలి(20) కూడా వెళ్లాడు. ఘర్షణలో భాగంగా ఆవేశానికి గురైన ఫరూక్ తన వద్ద ఉన్న కోవా బన్ను కత్తితో షేక్ ఖాదర్‌వలిపై దాడి చేశాడు. అతడి ఛాతీపై పలుమార్లు పొడిచాడు. ఈ ఘటనతో కుప్పకూలిపోయిన ఖాదర్‌వలిని, ముర్తుజావలిని స్నేహితులు హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే షేక్ ఖాదర్‌వలి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి తండ్రి మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా మృతి చెందిన ఖాదర్‌వలి అవివాహితుడు.



ఖాదర్‌వలి (ఫైల్)

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఓర్వకల్లు, జూన్ 18: మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన షేక్ జైతూన్ (30) విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ ఘటన మంగళ వా రం జరిగింది. గ్రామానికి చెందిన రాజేశ్వరమ్మ కిరాణం షాపు నిర్వహిస్తోంది. ఆమె వికలాంగురాలు రావడంతో ప్లగ్ తీయడానికి జైతూన్ సాయంగా వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త మాబాషా, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలానికి తహసీల్దార్ నటరాజ్, గ్రామ టీడీపీ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి, సర్పంచ్ చదువుల సుజాతమ్మ వెళ్లి పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.



మృతి చెందిన జైతూన్

యువకుడి ఆత్మహత్య

పాములపాడు, జూన్ 18 : మండలంలోని బానుముక్కల గ్రామంలో విశ్వేశ్వరరావు (25) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. కొంత కాలంగా విశ్వేశ్వరరావు కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం కడుపునొప్పి భరించలేక ఇంట్లోని బాతురూంలో ఉరివేసుకొన్నాడు. కుటుంబసభ్యులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెఎందినట్లు తెలిపారు. తండ్రి చిన్న హనుమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాములపాడు ఎస్ఐ అశోక్ తెలిపారు

సహకార సంఘాల్లో సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి

- లేకపోతే రుణాలు అందవు..
- పుల్లయ్య, సీఈవో

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 18 : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు అందించే కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతోందని, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఉన్న రైతులు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని ఆ సంఘం పర్సన్ ఇన్‌చార్జి నాగరమణయ్య, సంఘం సీఈవో పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, సభ్యత్వ నమోదు కార్యక్రమం వంద శాతం యథావిధిగా కొనసాగాలంటే ప్రతి రైతు తన పొలం, పాసు పుస్తకాలు, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్ ధృవీకరణ పత్రాలను, రెండు ఫొటోలను సంఘం సిబ్బందికి అందజేయాలని కోరారు.

క్యాజువాల్టీ విస్తరణకు చర్యలు

అదనపు 15 పడకలకు పనులు ప్రారంభం



పాత ఈసీజీ రూములో విస్తరణ పనులను చేపట్టిన సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్), జూన్ 18: అత్యవసర విభాగమైన క్యాజువాలిటీ విస్తరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పాత ఈసీజీ, ఫార్మసీ కౌంటర్ల గదుల్లో గోడల కూల్చివేత పనులు మొదలయ్యాయి. రోగుల రద్దీ దృష్ట్యా అదనపు పడకలతో క్యాజువాల్టీకి అనుసంధానం చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఫార్మసీ కౌంటర్‌ను ఎంసీ బ్లాక్ సమీపంలో మార్పు చేయడంతో క్యాజువాల్టీ విస్తరణ పనులు వేగవంతమయ్యాయి.

అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

నంద్యాల (కల్చరల్), జూన్ 18: జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో నిరుపేదలకు రాయితీపై ఆహారాన్ని అందించే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి మున్సిపల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గతంలో ఏర్పాటు చేసిన భవనాల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉంటే, వాటిని అనువైన ప్రదేశానికి షిఫ్ట్ చేయాలని అన్నారు. అన్న క్యాంటీన్లకు అవసరమైన ఫర్నిచర్, విద్యుత్, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ఆర్థిక అంచనాలు సమర్పించాలని ఆదేశించారు.

12 ఎకరాలు కబ్జా

వైసీపీ నాయకులపై ఆరోపణ



రామాపురం కొండల్లో అక్రమంగా తవ్విన పొలం ఇదే

రుద్రవరం, జూన్ 18 : రుద్రవరం రెవెన్యూ పరిధిలో తువ్వపల్లె కొండల్లో ఆరు ఎకరాలు అక్రమంగా మామిడి మొక్కలు నాటి కబ్జా చేశారని, అట్లాగే టి.లింగందిన్నె రెవెన్యూ పరిధిలోని రామాపురం కొండల్లో మరో ఆరు ఎకరాలు కబ్జా చేశారని టి. లింగందిన్నె సర్పంచ్ ఎం. లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు చిన్నిక్రిష్ణ మంగళవారం ఆరోపించారు. ఎలాంటి అనుమతిలేకుండా అక్రమంగా పొలాలు దున్ని మామిడి మొక్కలు నాటడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. రుద్రవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బ్రహ్మం తువ్వపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ అక్రమంగా కబ్జా చేసి ఒకరు పొలం దున్నితే మరొకరు మామిడి మొక్కలు నాటారని వారు విమర్శించారు. ఈ విషయంపై ఆర్. నాగలవరం గ్రామం రెవెన్యూ అధికారి పుల్లయ్య మాట్లాడుతూ ఈ పొలం విషయంలో తాము ఎలాంటి అనుమతి ఇవ్వలేదని అన్నారు.



తువ్వపల్లె కొండల్లో మామిడి మొక్కలు నాటిన పొలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మీదేవి

సిద్ధేశ్వరం ముంపు భూములపై పోరాడుతాం

టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

కొత్తపల్లి, జూన్ 18: శ్రీశైలం నీటి ముంపు నుంచి బయటపడిన భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులపై ఇరిగేషన్ అధికారులు కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, లేనిపక్షంలో న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం బైరెడ్డి కొత్తపల్లి మండలంలోని లలితా సంగమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ పూర్ణకుంభం స్వాగతం పలికారు. అనంతరం బైరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సిద్ధేశ్వరం, జానాల, బలపాలతిప్ప గ్రామాల పేద రైతులు 40 ఏళ్లుగా శ్రీశైలం రిజర్వాయరు నుంచి బయల్పడిన భూములను సాగు చేసుకుంటున్నారని అన్నారు. కొందరు స్థానికేతరులు ఈ భూములు కోసం వారితో తరచూ గొడవలకు దిగేవారని, గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు 144 సెక్షన్ అమలు చేయించి, ఆ భూములను ఎవరూ సాగు చేసుకోరాదని ఆంక్షలు విధించారన్నారు. అధికారులు రైతుల కడుపు కొడితే సహించేది లేదన్నారు. బైరెడ్డి సిద్ధేశ్వరం, బలపాలతిప్ప నీటి ముంపు భూములను సందర్శించేందుకు వెళ్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు సీఐ నాగభూషణ్, కొత్తపల్లి, పాములపాడు ఎస్ఐలు హరిప్రసాద్, అశోక్ ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. బైరెడ్డి ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో చర్చించడంతో, త్వరలోనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి పేద రైతులకు న్యాయం చేస్తామని చెప్పినట్లు బైరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, భాస్కర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, శివారెడ్డి, చిన్న పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

కూరగాయల ధరలను నియంత్రించాలి

ఆత్మకూరు, జూన్ 18: ఆకాశాన్ని అంటిన కూరగాయల ధరలను ప్రభుత్వం నియంత్రించేలా చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో కూరగాయల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఆ తర్వాత ప్రస్తుతం తొలిసారిగా అదే స్థాయిలో ధరలు పెరిగాయని గుర్తుచేశారు. అయితే ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు స్పందించి పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

హామీని నెరవేర్చారు..


వెలుగోడులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

వెలుగోడు, జూన్ 18: ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి నేడు అమలు పరచడం పట్ల దివ్యాంగులు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వెలుగోడు పట్టణంలోని పాత బస్టాండ్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులు, టీడీపీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నారపు శేషి రెడ్డి అబ్దుల్ కలాం, ఖలీలుల్లా ఖాన్, హిదాయత్ అలి ఖాన్ మోమిన్ రసూల్ అమీర్ హంజా, జాకీర్‌హుసేన్, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గంగాదర శెట్టి తదితరులుపాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి


మిడుతూరులో మానవహారంగా విద్యార్థులు

మిడుతూరు, జూన్ 18: అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఎంఈవో రామిరెడ్డి అన్నారు. మిడుతూరులో మంగళవారం నేను బడికి పోత కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి కార్యక్రమం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, 100 శాతం విద్యార్థులు పాఠశాలకు నమోదు ఉండాలని తెలిపారు. అనంతరం బస్టాండు ఆవరణలో విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనాథ్, కేజీబీవీ పాఠశాల ఎస్‌వో విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణుడి మృతి పార్టీకి తీరనిలోటు : ఎమ్మెల్యే


కృష్ణుడి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు, జూన్ 18 : మండలంలోని వేంపెంట గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు గాండ్ల క్రిష్ణుడు మృతి పార్టీకి తీరని లోటని నందికొట్కూరు ఎంఎల్‌ఏ గిత్తా జయసూర్య అన్నారు మంగళవారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, లెనిన్‌బాబు, ఆదిరెడ్డి, హరిసర్వోత్తమరావు, తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, మధుక్రిష్ణ, చంద్రశేఖర్, గోవిందు, బండ్లమూరి వెంకటేశ్వరరావు, సత్యంరెడ్డి లింగస్వామి పాల్గొన్నారు.

వైభవంగా అష్టదళ పాదపద్మారాధన సేవ



నంద్యాల కల్చరల్, జూన్ 18 : నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కోదండరామాలయంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్రాలతో అలకంరించి వివిధరకాల పుష్పాలచే పూజలు నిర్వహించారు. 108 రకాల వెండి పుష్పాలచే అష్టదళపాదపద్మారాధన సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారథి, భక్తులు తదితరలు పాల్గొన్నారు.

కాళీమాత అమ్మవారికి: నంద్యాల గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ అమ్మవారికి మంగళవారం వైభవంగా అలకంరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించి 108 వెండి పుష్పాలచే అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి

పాములపాడు, జూన్ 18 : రైతులు తమ పంటపొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి, ఎరువులు వాడుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి హేమలత అన్నారు. మంగళవారం పాములపాడులో మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా పంట సాగుకు ముందు పచ్చి రొట్ట వాడకం, సోయచిక్కుడు, మినుము కంది పంటల్లో తెగుళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరువు బృందానికి పంట నష్టాన్ని వివరించండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జూన్ 18: గత సంవత్సరం రబీ సీజన్‌లో పంట నష్టపోయిన రైతుల వివరాలను కేంద్ర బృందానికి స్పష్టంగా వివరించాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో కేంద్ర కరువు బృంద పర్యటనపై జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర బృందం టీమ్ లీడర్, న్యూఢిల్లీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండీచర్ డైరెక్టర్ చిన్మయ గాట్కేర్ (ఐఏఎస్), తాగునీరు, పారిశుధ్యశాఖ డిప్యూటీ అడ్వైజర్(పిహెచ్) ఆశిస్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవిందకుమార్ సోని సభ్యుల బృందం ఈ నెల 20వతేదీన జిల్లాకు రానుందని తెలిపారు. కేంద్ర కరువు బృందం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి కరువు తీవ్రతను సమగ్రంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. తగ్గిన పాల ఉత్పత్తి, కూలీలకు కల్పించిన పనులు, ట్యాంకర్ల ద్వారా నీటి రవాణా మొదలైన వాటిపైన నివేదికలను సిద్ధం చేసి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్వో పద్మజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


కేంద్ర కరువుబృంద పర్యటనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్, జేసీ

గుర్రపు డెక్క తొలగించండి : మంత్రి ఫరూక్

గోస్పాడు, జూన్ 18 : కుందూ నదిలో పెరిగిన గుర్రపు డెక్క రబ్బరు చెట్లను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులను రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశించారు. గోస్పాడు మండలం తేళ్ళపూరి వద్ద కుందూలో పేరుకుపోయిన గుర్రపు డెక్క సమస్యను మండల టీడీపీ నాయకులు మంత్రికి వివరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, నాయకులు జిన్నా శ్రీనివాసరెడ్డి, వీరసింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వేమారెడ్డి, తదితరులు గుర్రపు డెక్క వల్ల కుందూకు నీరు పారే సమయంలో తూములకు అడ్డుపడి బ్రిడ్జిపై నుంచి పారే ప్రమాదం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై మంత్రి ఫరూక్ నీటి పారుదల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వర్షాలు ప్రారంభమై కుందూకు నీరు వచ్చే సమయంకంతా సమస్యను పరిష్కరించాలని, పరివాహక ప్రాంతంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్ జూన్ 18 : నందికొట్కూరు నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మంగళవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో నందికొట్కూరు నియోజకవర్గంలోని మల్యాల ఎత్తిపోతల నుంచి కేసీకెనాల్‌కు రెండు పంపుల ద్వారా నీటిని అందించిన ఘనత మాండ్ర శివానందరెడ్డిది అన్నారు. అలాగే నియోజకవర్గంలోని నాగటూరు ఎత్తిపోతల, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లె మండలాలలోని ఎత్తిపోతల పథకాలను యుద్ధప్రాతిపధికన పూర్తి చేయించాడని అన్నారు. మల్యాల ఎత్తిపోతల ద్వారా కర్నూలు, కడప, అనంతపూరం, జిల్లాలకు సాగు, తాగునీటిని అందించిన ఘనత కూడా టీడీపీదేనని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. అనంతరం అల్లూరు గ్రామంలోని ఎంపీపీ స్పెషల్ స్కూల్, ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. అలాగే అంగన్ వాడీ మూడో సెంటర్‌ను కూడా ఎమ్మెల్యే జయసూర్య పరిశీలించారు. అక్కడ అంగన్ వాడీ టీచర్ గా పనిచేస్తున్న సరస్వతిని సెంటర్‌లో అన్ని సక్రమంగా చిన్నారులకు అందజేస్తున్నారా అని అడిగి తెలుకున్నారు. పక్కనే అసంపూర్తి ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను చూపిస్తూ వైసీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పయజున్నిసాబేగం, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, కడియం వెంకటేశ్వర్లు యాదవ్, ప్రసాదరెడ్డి, కాతారమేష్‌రెడ్డి, పల్లె రఘురామిరెడ్డి, జమీల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య


అల్లూరులోని ఎంపీపీ స్పెషల్ స్కూల్‌లో విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

తెలుగు మీడియాన్ని కొనసాగించాలి

గడివేముల, జూన్ 18: రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష మీడియంతో పాటు తెలుగుమీడియం కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లి కార్యదర్శి మానపాటి రవి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇంగ్లీష మీడియం కొనసాగిస్తే గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇంగ్లీష మీడియంతో పాటు తెలుగు మీడియం కొనసాగించాలని అన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు 117 జీవోను రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం రద్దు చేసి ప్రాథమిక విద్యను కాపాడాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఉపాధ్యాయుల బోధనకు ఆటంకంగా ఉన్న వివిధ రకాల యాప్‌లను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లు నాగన్న, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

దంచికొట్టిన వాన

కొత్తపల్లి, జూన్ 18: కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమేశ్వరం క్షేత్రంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సంగమేశ్వరంతో పాటు ఎర్రమటం, ముసలమడుగు, పాతమాడుగుల, చిన్నగుమ్మడాపురం, పెద్ద గుమ్మడాపురం, లింగాపురం, శివపురం తదితర గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. గత వారం రోజులుగా వర్షం లేక ఎండిపోతున్న పంటలకు ఈ వర్షం జీవం పోసినట్లయింది. ఏదేమైనా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులకు చేతి నిండా పని దొరికినట్లయిందని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సంగమేశ్వరంలో కురుస్తున్న వర్షం

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా జట్టు


రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 18: నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంకల్ప్ ఒలంపియాడ్ స్కూల్‌లో అండర్ 11 బాల బాలికల జిల్లా చెస్ ఎంపిక పోటీలు జరిగాయి. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. విజేతలైన క్రీడాకారులకు అతిథులు పతకాలు అందజేశారు. రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా జట్టును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఆర్బిటర్లు పాల్గొన్నారు.

నియమావళిపై అవగాహన పెంచుకోండి

జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



నంద్యాల (కల్చరల్), జూన్ 18: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి, సీసీఏ, కండక్ట్ రూల్స్‌పై ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి సంపూర్ణ అవగాహన ఉండాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి కలెక్టరేట్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సీసీఏ రూల్స్, కండక్ట్ రూల్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. జిల్లా రెవిన్యూ అధికారి పద్మజ, అన్ని సెక్షన్ల సూపరిండెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి తన విధులలో రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి, విచారణ ఎలా చేపట్టాలి .. అనే అంశాలపై క్షుణ్ణంగా తెలుసుకోవాలని అన్నారు. సీసీఏ రూల్స్, కండక్ట్ రూల్స్‌పై సెక్షన్ కేసు స్టడీ ఇచ్చి దానిపై నివేదికలు తెప్పించుకోవాలని డీఆర్వోను ఆదేశించారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో బదిలీలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 18: నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ కమిషనర్ భార్గవ్‌తేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్ వీఎం శ్రీకాంత్‌ను మెయిన్ సెక్షన్‌లో సీ-3 క్లర్క్‌గా అక్కడ పని చేస్తున్న శివశంకర్‌ను పబ్లిక్ హెల్త్ సెక్షన్ సీ-3 క్లర్క్‌గా, పబ్లిక్ హెల్త్ సెక్షన్‌లో పని చేస్తున్న ఎం.రాజును టౌన్ ప్లాన్ సెక్షన్‌లో జీ-1 క్లర్క్‌గా బదిలీ చేశారు. అదేవిదంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సూపరింటెండెంట్ వి.సుబ్బన్నను అదే సెక్షన్‌లో పని చేస్తున్న పి.కిష్టఫర్‌బాబు ప్లేస్‌కు, పి.కిష్టఫర్‌బాబును రెవెన్యూ సెక్షన్‌కు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ పి.సాదిక్ హుసేన్‌ను రెవెన్యూ సెక్షన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు రెవెన్యూ సెక్షన్‌లో పని చేస్తున్న సూపరింటెండెంట్ పీఎస్ రాజేశ్వరరావును ఇంజనీరింగ్ సెక్షన్‌కు, ఖాళీగా ఉన్న రెవెన్యూ ఆఫీసర్ పోస్టుకు మేనేజర్ చిన్నరాముడుకు ఇన్‌చార్జిగా నియమిస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీలను చేపట్టిన్లు ఆయన వెల్లడించారు.

మంత్రికి శుభాకాంక్షలు


మైనార్టీ శాఖ మంత్రిని కలిసిన మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, రబ్బానీ గ్రూప్స్ అధినేత అల్-హజ్-హాజీ- మాహబూబ్ సాహెబ్

నందికొట్కూరు, జూన్ 18: ముస్లిం మైనార్టీ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, రబ్బానీ గ్రూప్స్ అధినేత అల్-హజ్-హాజీ- మాహబూబ్ సాహెబ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని మంత్రి నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముజబుర్ రహిమాన్, అబ్దుల్ రహిమాన్, 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, ముజీబ్, రసూల్ పసుల శ్రీనివాసులు నాయుడు, రియాజ్ అబ్బాస్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన భూమా



రాష్ట్ర మంత్రి ఫరూఖ్‌తో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 18: రాష్ట్ర న్యాయ, మైనారిటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి. ఫరూక్‌ను మంగళవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఫరూక్‌ను సన్మానించారు. అనంతరం ఆయన కార్యాలయంలో ఇరువురు చర్చించుకున్నారు.

పెట్రోల్ బంకు ఎదుట ఆందోళన


పెట్రోల్ బంకు ఎదుట ఆందోళన చేస్తున్న వినియోగదారుడు, ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు

నందికొట్కూరు, జూన్ 18: పెట్రోల్ కొలతలపై రీడింగ్ మోసం చేస్తున్న పెట్రోల్ బంక్ యజమానిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న పెట్రోల్ బంకులో ఓ ద్విచక్రవాహనదారుడు తన వాహనానికి పెట్రోల్ ఫిల్ చేయించుకునేందుకు అక్కడి వచ్చారు. ఆయన రూ.180 ఇస్తే..రూ.120 పెట్రోల్ మాత్రమే ఫిల్ చేసి పంపించారు. అయితే మైలేజీ తక్కువగా రావడంతో కస్టమరు పెట్రోల్ పంపు దగ్గరకు వచ్చి ఆందోళనకు దిగారు. అయితే మేజర్, యజమాని దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో ప్రజా సంఘాలు, వినియోగదారులు ఆగ్రహంతో పెట్రోల్ బంకును బంద్ చేయించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి సమస్యను సర్దుమణిగించారు. ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొలతలు తూనికల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాటిపోగు సోమన్న, రమణ, మధు, భాస్కర్ గౌడ్, ఉపేంద్ర, రియాజ్, షేక్ అబ్దుల్ పాల్గొన్నారు.

22, 23న దేవదాయ భూములకు కౌలు వేలాలు

పాణ్యం, జూన్ 18 : మండలంలోని దేవదాయ భూములకు కౌలు వేలాలు 22, 23 తేదీలలో నిర్వహిస్తున్నట్లు పాణ్యం గ్రూపు దేవాలయాల ఈవో సువర్ణ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 22న పాణ్యంలోని శ్రీరామస్వామి ఆలయానికి చెందిన 49. 04 ఎకరాలు, శ్రీ వీరనారాయణస్వామి ఆలయానికి చెందిన 10.22 ఎకరాలు, పాణికేశ్వరస్వామి ఆలయానికి చెందిన 13. 87 ఎకరాలు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న గోనవరంలోని వేణుగోపాలస్వామి, భీమేశ్వరస్వామి ఆలయానికి చెందిన 26.44 ఎకారాలను కౌలు వేలం నిర్వహిస్తున్వట్లు తెలిపారు. కౌలు వేలం కాలం 2027 వరకు ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే రైతులు రూ. 2 వేలు డిపాజిట్టు చెల్లించి పాటలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

నంద్యాల కల్చరల్ : నంద్యాలలో గాంధీచౌక్ ఏరియాలో వెలసిన కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానానికి చెందిన షాపులు 20న ఉదయం 10గంటలకు ఆలయ ఆఫీసు ప్రాంగణంలో బాడుగకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. షాపు నెంబర్లు వరుసగా 17-231-ఎ, 17-231-బి, 17-231-సి, 17-231-డి, 17-231-ఇ మెత్తం 5రూములు 3 సంవత్సరాల కాలానికి బాడుగకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. అలాగే నంద్యాల కోటవీధిలో వెలసిన బ్రహ్మానందీశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూములు కౌలు వేలం, రూములు బాడుగకు బహిరంగ వేలం 20న ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. షాపు నెంబరు 22-140, ఖాళీ స్థలం, సర్వేనెంబరు 1181, 1195-1,1195-3లలో ఆలయానికి చెందిన భూములు 3 సంవత్సరాలకు కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. పాటలో పాల్గొనే వారు ఆలయ ప్రాంగణంలో 20న సాయంత్రం బహిరంగ వేలంలో పాల్గొనాలని ఈవో తెలిపారు. వేలం పాట నియమ నిబంధనల కోసం ఆసక్తి కలిగిన వారు, వేలం పాటలో పాల్గొనే వారు మరిన్ని వివరాలకు ఆయా ఆలయాల ప్రాంగణంలోని ఆఫీసులలో సంప్రదించాలని ఈవో తెలిపారు.

ఆకాశంలోకి ఉల్లి ధర

● క్వింటం రూ.1,835 ● సంతోషంలో రైతులు



కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 18 : ఉల్లిగడ్డల ధరలు మళ్లీ ఆకాశానికి ఎగబాకుతున్నాయి. మంగళవారం కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డులో రైతులు విక్రయానికి తెచ్చిన ఉల్లి ధరలు క్వింటంపై గరిష్ఠ, మధ్యస్థ ధరలు రూ.1,835, కనిష్ఠ ధర రూ.1401గా నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, అదనపు సెక్రటరీలు వెంకటేశ్, రెహిమాన్ తెలిపారు. అదే విధంగా కందుల ధరలు కూడా పెరుగుతున్నాయని, గరిష్ఠ ధర క్వింటం రూ.11,251 నమోదైందని, కనిష్ఠ ధర రూ.2,052 ఉందని తెలిపారు. శనగలు గరిష్ఠ ధర, కనిష్ఠ ధర రూ.6,709 రైతులకు లభించింద ని, ఎండుమిర్చి క్వింటం గరిష్ఠ ధర రూ.9,449, కనిష్ఠ ధర రూ.6,599 అని సెక్రటరీ గోవిందు తెలిపారు. వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.7,100, మధ్యస్థ ధర రూ.6,069, కనిష్ఠ ధర రూ.2,882 రైతులకు అందినట్లు ఆయన తెలిపారు.

బాట సుంకులమ్మకు పూజలు



బాట సుంకులమ్మకు పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ

అవుకు, జూన్ 18: మండలంలోని వేములపాడు గ్రామ మెట్ట సమీపంలో వెలసిన బాట సుంకులమ్మకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పూజలు నిర్వహించారు. అంతకు ముందు టీడీపీ నాయకులు బోయిన ప్రభాకర్, గుర్రప్ప, గ్రామ సర్పంచ్ సుబ్బ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో గ్రామస్థులు బీసీ ఇందిరమ్మకు ఘనస్వాగతం పలికారు. బాట సుంకులమ్మకు బోయిన ప్రభాకర్ మొక్కుబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ ఇందిరమ్మ హాజరై అమ్మవారికి నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో ప్రజలకు భరోసా



కిరణ్‌ను పరామర్శిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, జూన్ 18: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పాలనతో ప్రజలకు భరోసా వచ్చిందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తెలుగు యువత నాయకుడు సిటీ కేబుల్ కిరణ్ ప్రమాదానికి గురికావడంతో ఆయన ఇంటికి వెళ్లి సుబ్బారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు సీఎం చంద్రబాబు తప్పనిసరిగా న్యాయం చేస్తారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేరుస్తున్నారంటే ప్రజల కోసం ఎంత చిత్త శుద్ధితో పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట టీడీపీ బీసీ సెల్ నాయకులు చక్రపాణిగౌడు, ఎర్రస్వామి గౌడు, బీఎడ్ బాషా ఉన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన టీడీపీ నాయకులు



నారా లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్న వేణు

రుద్రవరం, జూన్ 18 : రాష్ట్ర ఐటీ, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను విజయవాడలో మంగళవారం రుద్రవరం మండలం బి.నాగిరెడ్డిపల్లెకు చెందిన టీడీపీ యువ నాయకుడు వేణు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని మంత్రి నారాలోకేశ్ సూచించారు. యువ నాయకున్ని మంత్రి నారాలోకేశ్ అభినందించారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారని వేణు తెలిపారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు, బాధితుడు అక్బర్ మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం ఉండవల్లిలో కలిశారు. తనకు న్యాయం చేయాలంటూ వినతి రూపంలో తెలియజేశారు. పొలం సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని నారా లోకేష్‌ను కోరారు. ఆయన స్పందించి న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారని అక్బర్ పేర్కొన్నారు.

ఘనంగా పెండేకంటి వెంకటసుబ్బయ్య జయంతి



పెండేకంటి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బనగానపల్లె, జూన్ 18: దివంగత మాజీ గవర్నర్ పెండేకంటి వెంకట సుబ్బయ్య జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులోని వాసవి పాలిటెక్నిక్ కళాశాల కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసులు, వాసవి అకాడమి సంయుక్త కార్యదర్శి ఆనంద్‌లు పెండేకంటి వెంకటసుబ్బయ్య విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ పెండేకంటి బనగానపల్లె పరిసర ప్రాంతాల్లోని గ్రామీణులకు విద్యనభ్యసించడానికి విద్యా సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21 నుంచి ఆలయ భూములకు కౌలు వేలం

శిరివెళ్ల, జూన్ 18: మండలంలోని కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని పలు ఆలయాలకు చెందిన భూములకు 2024-25 సంవత్సరానికి గాను బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి గంటా వేణునాథరెడ్డి మంగళవారం తెలిపారు. బోయలకుంట్ల గ్రామంలోని వివిధ ఆలయాలకు చెందిన 66.15 ఎకరాల భూములకు ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రామేశ్వర, వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 25.26 ఎకరాలకు, అనంత పద్మనాభ స్వామి దేవస్థానానికి చెందిన 11.62 ఎకరాలకు, ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన 11.44 ఎకరాలకు, వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 11.89 ఎకరాలకు, నరసింహ స్వామి దేవాలయానికి చెందిన 5.94 ఎకరాలకు వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. అలాగే కోటపాడు గ్రామంలోని కేశవ స్వామి ఆలయానికి చెందిన 45.58 ఎకరాల భూములకు, వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 38.27 ఎకరాలకు ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. ఏడాది కాల పరిమితితో నిర్వహిస్తున్న ఈ వేలాల్లో పాల్గొనేందుకు రైతులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని ఈవో వెల్లడించారు.

విలు విద్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బనగానపల్లె, జూన్ 18: ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి విలు విద్య పోటీల్లో బగానపల్లె పట్టణంలోని ప్రియదర్శిని పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు స్కూల్ కరస్పాండెంట్ కేసర్‌లింగ్ మంగళవారం తెలిపారు. అండర్ 10 విభాగంలో సుదీప్ తృతీయ స్థానంలో, అండర్ 13 విభాగంలో ప్రథమ స్థానంలో కార్తికేయ, ద్వితీయ స్థానంలో అజ్మల్, తృతీయ స్థానంలో రోహిత్‌లు నిలిచారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను హెచ్‌ఎం. సాబిరాబీ, పీఈటి దుర్గాప్ర సాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థి బస్సులు నడపాలి

డోన్(రూరల్), జూన్ 18: గ్రామీణ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే విద్యార్థి బస్సులను ఆర్టీసీ అధికారులు నడపాలని ఎస్ఎఫ్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్, షేక్ షాహీదా డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు విజయకుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరిని చూపారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రె డ్డి స్పందిస్తూ విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పల్లెల్లో నాటు ఘాటు

» మద్యం మత్తులో గ్రామీణ యువత

» కొలిమిగుండ్ల ప్రధాన వీధుల్లో మద్యం అమ్మకాలు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 18: మండలంలోని వివిధ గ్రామాల్లో నాటు ఘాటు గుబాళిస్తోంది. అధికారుల అవినీతి, నిర్లక్ష్యం కారణంగా మద్యం, బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత మద్యం మత్తులో జోగుతోంది. గ్రామాల్లో చౌకగా దొరికే గుడుంబా ప్యాకెట్లుకు యువత బానిసగా మారి ఒళ్లు గుల్ల చేసుకుంటోంది. వారి ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు, పోలీసుల అండదండలతో నాటుసారా, బెల్ట్ షాపులు, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా కొనసాగాయన్న విమర్శలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం మారినా పోలీసుల తీరు మారలేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రమైన కొలిమి గుండ్లలో ప్రధాన వీధుల్లో నాటుసారా విక్రయాలు కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకోక పోవడాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పాఠశాలలు, ఆసుపత్రి, పోస్టాఫీసు తదితర కార్యాలయాల సమీపంలో కొలిమిగుండ్లలోని శాంతినగర్‌లో నాటుసారా, బెల్ట్ షాపుల విక్రయాలు కొనసాగుతున్నాయని ఆయా ప్రాంతాల్లో నివాస ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళల్లో తాగుబోతులు వీధుల్లోకి వచ్చి, ఇక్కడ మద్యం విక్రయిం చేది ఎక్కడ? అని ఇళ్లల్లో నివసిస్తున్న వ్యక్తులను అడుగుతున్న తీరు పోలీసుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గ్రామం నడి బొడ్డున అక్రమం గా మద్యం విక్రయాలు కొనసాగుతోంటే అసలు అధికారులు ఉన్నారా ..? అన్న ప్రశ్నలు సామాన్య ప్రజలకు తలెత్తుతున్నాయి. మరోవైపు కొలిమి గుండ్లతోపాటు కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, చింతలాయపల్లె, తుమ్మల పెంట, బందార్లపల్లె, పేట్నికోట తదితర గ్రామాల్లో సైతం చిరు దుకాణాల మాటున మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో ప్రధాన వీధుల్లో మద్యం విక్రయాలు కొనసాగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవుకు మండలంలోని కొండమీద గ్రామాల్లో తయారవుతున్న నాటు సారా, ప్రతి రోజు పెద్ద ఎత్తున కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాలకు మోటార్‌సైకిళ్లపై సరఫరా అవుతోంది. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతి రోజు 1000లీటర్ల వరకు నాటుసారా విక్రయాలు కొన సాగుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. పట్ట పగలు నాటుసారా రవాణా అవుతున్నా, జనసంచారం మధ్య మద్యం విక్రయాలు కొనసాగు తున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో వారి అండదండలతోనే ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మార్కెట్లో లభ్యమవుతున్న నాటుసారా ప్యాకెట్లు

తల్లిదండ్రులకు నివాళులర్పించిన ఎమ్మెల్యే



భూమా ఘాట్‌లో తల్లిదండ్రులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూన్ 18: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ ఆమె తల్లిదండ్రులకు మంగళవారం ఘనంగా నివాళులర్పించింది. ఎన్నికల్లో గెలుపొందిన ఆమె మంత్రుల ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొని ఆళ్లగడ్డ రావడంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీ ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భూమా ఘాట్ చేరుకొన్నారు. ఎమ్మెల్యే విజయవాడ నుంచి నేరుగా ఘాట్‌కు చేరుకొని భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డిలకు నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీతో ఆళ్లగడ్డ పాతబస్టాండు నుంచి ఇంటికి చేరుకున్నారు. ఈమె ఆమె తమ్ముడు భూమా విఖ్యాత్‌రెడ్డి ఉన్నారు.

విజయోత్సవ ర్యాలీలో అపశృతి: ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందిన అఖిలప్రియ విజయోత్సవ ర్యాలీలో మంగళవారం అపశృతి చోటు చేసుకుంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేపట్టిన విజయోత్సవ ర్యాలీ కందుకూరు రోడ్డులోని శోభా ఘాట్ నుంచి పట్టణంలోకి జరుగుతుండగా అదే మార్గంలో ఉన్న ఏవీ కళ్యాణమండపంపై ఆకతాయిలు రాళ్లు రువ్వడంతో అద్దాలు పగిలిపోయాయి. అలాగే రిలయన్స్ మార్ట్ పక్కనే ఉన్న ఏవీ రెస్టారెంట్‌పై రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో రెస్టారెంట్ అద్దాలు ధ్వంసమయ్యాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బనగానపల్లె, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అంది స్తున్నామని, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని ఇల్లూరు కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యా ర్థులు, తల్లిదండ్రులతో కలసి నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సేవలను వివరించారు. గత సంవత్సర పదో తరగతి పబ్లిక్ ఫలి తాలపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న పాఠశాల గదిని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి, సమగ్ర శిక్ష అధికారి రఘురామిరెడ్డి, ఉపాధ్యాయులు కుమార్‌బాబు పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయాలి: ఏపీటీఎఫ్

బనగానపల్లె , జూన్ 18: పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే 117 జీవో రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం బనగానపల్లె ఏపీటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వెంకటకృష్ణుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాధవ స్వామి మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేసినట్లయితే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో మార్పుకు శ్రీకారం చుట్టినట్టవుతుందన్నారు. అంగ్లమాధ్యమానికి సమాంతరంగా తెలుగు రాష్ట్రంలో మాతృ భాషగా వెలుగొందుతున్న తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. 3,4,5తరగతులను తిరిగి ప్రాథమికపాఠశాలలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 3,4,5 తరగతుల చదివే విద్యార్థులు మూడు కిలో మీటర్ల దూరం ఉన్న ఉన్నతపాఠశాలకు వెళ్లలేక బడి మానేసి కార్మికులుగా మారుతున్నారన్నారు. తల్లికివందనం పతకాన్ని ప్రభుత్వపాఠశాలల్లో చేర్చే విద్యార్థులకు ఇవ్వాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన మాధవస్వామిని, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మధుసూదన్‌రావును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ఆళ్లగడ్డలో భారీ వర్షం

ఆళ్లగడ్డ, జూన్ 18: ఆళ్లగడ్డ ప్రాంతంలో మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. దీంతో పొలాల్లో వర్షపు నీరు నిలిచి పొలాలన్ని కుంటలను తలపించాయి. ఆళ్లగడ్డ మండలంలో 10.6 సెంమీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

హామీలను నెరవేరుస్తా: ఎమ్మెల్యే కోట్ల





ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కోట్లను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ అభిమానులు

డోన్, జూన్ 18: డోన్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తారకరామనగర్‌లో ఎమ్మెల్యే కోట్ల పర్యటించారు. ఉదయం 7 గంటలకే ఎమ్మెల్యే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు తీసుకువచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే సంబంధిత మున్సిపల్, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రూ.1000 పెంచడానికి ఐదేళ్లు పట్టిందని.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పింఛన్‌ను రూ.4వేలకు పెంచి పేదల కడుపు పేదలకు అండగా నిలిచారన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి వైపు నడుస్తుందని అన్నారు. డోన్‌లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మల్లి రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి విజయభట్టు, పాల్‌రాజు, చంద్రపల్లి ఆచారి, ఆంజనేయగౌడు, ఖాజా, రంగయ్యగౌడు, పుల్లయ్యగౌడు, లారీల బాషా, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

● నూతన బస్సు సర్వీసులు ప్రారంభించిన ఎమ్మెల్యే: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో రెండు నూతన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. డోన్ నుంచి తిరుపతి, విజయవాడ బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

కోట్లకు అభినందనల వెల్లువ: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంగళవారం అభినందనలు వెలువెత్తాయి. వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు కలిసి అభినందనలు తెలిపారు. పంచాయితీరాజ్, క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జునమూర్తి, డోన్ పీఆర్ ఏఈ నారాయణ, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సర్వశిక్ష అభియాన్ అధికారులు, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు ఎమ్మెల్యే కోట్లను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు అందజేసి సన్మానించారు. డోన్ నియోజకవర్గంలో గృహ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను హౌసింగ్ ఈఈని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మకు తమ సమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మల్లి రమణ, లక్ష్మీనారాయణ యాదవ్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని తారకరామనగర్‌లో మంగళవారం ఉదయం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి టీడీపీ అభిమానులు ఘన సత్కరించారు. తారకరామనగర్‌కు చెందిన టీడీపీ నాయకులు టైలర్ ఖాజా, ధర్మవరం ఈశ్వరయ్య, లారీల బాషా ఆధ్వర్యంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నియోజకవర్గ కో ఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం





చాగలమర్రి, దొర్నిపాడులో బైక్ ర్యాలీ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

చాగలమర్రి, జూన్ 18: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆళ్లగడ్డకు చేరడంతో స్వాగతం పలికేందుకు అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై తరలివెళ్లారు. శోభాఘాట్ వద్దకు వెళ్లి ఆమెకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, షరీఫ్, మౌళాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, అవుల ప్రతాప్, అజీమ్, కరిముల్లా, టైలర్ ఖాదర్, గఫార్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: సీఎం చంద్రబాబుతోనే పేదలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ సొసైటీ అధ్యక్షుడు సిద్ధి సత్యం, నాయనగారి శ్రీనివాసులు, మల్లేశ్వరచౌదరి, అమరసాని రవికుమార్, జిల్లా సుబ్బన్న, మండల సెక్రటరీ కొత్తపల్లి సురేంద్రలు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డకు రావడంతో ఆమెకు టీడీపీ నాయకులు, జనసేన నాయకులు భారీగా ద్విచక్ర వాహనాల్లో ర్యాలీగా తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటనాయుడు, గోపాల్‌నాయుడు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

బేతంచెర్ల, జూన్ 18: డోన్ ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విజయం సాధించడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మేకల నాగరాజు, టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్‌ల సమక్షంలో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాధవ, మంచినీళ్ల సుమంత్, శ్రీపతి నాగరాజు, కానాల అంజి పాల్గొన్నారు.

ఘనంగా స్వాతి వేడుకలు

ఆళ్లగడ్డ, జూన్ 18: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను వేదపండితులు మంగళవారం నిర్వహించారు. వేదపండితులు వేకువజామున్నె ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పూలమాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. 108 కలశాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

డోన్(రూరల్), జూన్ 18: మండలంలోని దేవరబండ గ్రామ ప్రాథమిక పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. దేవరబండ గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటనారాయణ గౌడు చేతుల మీదుగా విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌గౌడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటికుంటగా మారిన బస్టాండ్



ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నిలిచిన వర్షం నీరు

కోవెలకుంట్ల, జూన్ 18 : గత కొన్నిరోజులుగా ఎడ తెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో చుట్టూ నీరు చేరి నీటి కుంటగా మారిపోయింది. ఆర్అం డ్‌బీ రోడ్డు ఎత్తు కంటే ఆర్టీసీ బస్టాండు తగ్గులో ఉండడంతో చిన్నపాటి వర్షం వస్తే నీరు నిల్వ అవుతున్నది. దీంతో బస్టాండు ప్రాంగణమంతా కుంటను తలపిస్తుంది. నీరు నిల్వ చేరడంతో ప్రయాణికులు బస్టాండులో నుండి బస్సుల్లో ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బస్టాండు ప్రాంగణంలో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కౌలు వేలంలో పెరిగిన ఆదాయం

ఉయ్యాలవాడ, జూన్ 18: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో నిర్వహించిన కౌలు వేలంలో ఆదాయం పెరిగినట్లు బనగానపల్లె డివిజన్ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామంలోని శివాలయం వద్ద 51.25 ఎకరాల ఆలయ భూమిని ఏడాది పాటు కౌలు వేలం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతేడాది ఈ భూమికి రూ. 1.80లు కౌలు రాగా ఈ ఏడాది రూ. 2.22 లక్షలు వచ్చిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా 42 వేలు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రుడు, గ్రామ పెద్దలు, పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాల ఖాళీపై ఫ్యాక్టరీ యాజమాన్యం ఒత్తిడి

ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

బేతంచెర్ల, జూన్ 18: మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యం పాఠశాలను ఖాళీ చేయాలంటూ ఒత్తిడి చేస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. సిమెంటునగర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 500 మంది విద్యార్థులు చదు వుతున్నారని ప్రధానోపాధ్యాయురాలు ముష్రాఫ్ జహాన్ మంగళవారం తెలిపారు. పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యం విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామని అన్నారని తెలిపారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో పని చేసే 24 మంది ఉపాధ్యా యులు కౌన్సెలింగ్‌కు వెళ్లగా వద్దన్నారని కూడా తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఉపాధ్యాయులు వెళ్లాలా? వద్దా? అనే అయోమయంగా ఉన్నట్లు ఆమె వాపోయారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 18: పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా సాగు చేసిన చీనీ, మామిడి, టెంకాయ తదితర పంటలను ఆయన పరిశీలించారు. పండ్ల తోటల పెంపకంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఉపాధి కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపిఓ గంగన్న, టీఏలు రాజాబాబు, ఈసీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కేంద్ర కరువు బృందం రాక

దొర్నిపాడు, జూన్ 18: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం కేంద్ర కరువు బృందం రానున్నట్లు వ్యవసాయాధికారి సునిత తెలిపారు ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ. 3,156 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అన్నారు. ఇందుకు సంబంధించి పంట నష్టపోయిన రైతుల వివరాలను గుర్తించేందుకు కరువు బృందం వస్తున్నట్లు తెలిపారు. పంట నష్టపోయిన రైతులు పూర్తి సమాచారం అందించాలని సూచించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు.

పింఛన్ పెంపుపై హర్షం

ప్యాపిలి, జూన్ 18: సామాజిక పింఛన్ పెంపుపై మండలంలోని బోయవాండ్లపల్లి గ్రామంలో మంగళవారం వృద్ధులు, వితంతువులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు పింఛన్‌దారులు మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్‌ను పెంచి వృద్ధులు, వితంతువు, వికలాంగుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాములు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పని వేళలు పాటించాలి

అవుకు, జూన్ 18: పశువైద్యాధికారులు, సిబ్బందికి సమయపాలన తప్పనిసరి అని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మారుతి సహకారం అన్నారు. మంగళవారం అవుకు వైద్యశాలతో పాటు చెన్నంపల్లె, చనుగొండ్ల ఆర్బీకే సెంటర్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధులపై పశువైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాడి పశువులకు వ్యాపించే గొంతువాపు, చిటుక వ్యాధులపై యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అవుకు, గుండ్లశింగవరం పశువైద్యాధికారులు భారతి దేవి, ఐశ్వర్య పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

చాగలమర్రి, జూన్ 18: చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను మంగళవారం ఎంఈవో అనూరాధ తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న అదనపు భవన పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. వివిధ రికార్డులు పరిశీలించారు. ఎస్‌వో సునిత, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.